



గుండెపోటుతో సచివాలయ ఉద్యోగి మృతి


సుధీర్ (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి - టి.నరసాపురం

గుండె పోటుతో టి.నరసాపురం-1 సచివాలయ ఉద్యోగి సోమవారం మృతిచెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చింతలపూడి మండలం కంచనగూడెం గ్రామానికి చెందిన బోడా సుధీర్(34) టి.నరసాపురం-1 సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని మక్కినవారిగూడెంలో ఉదయం జగనన్న ఆరోగ్య సురక్షలో పాల్గొని ఆయనకు కొద్దిగా కళ్ళు తిరిగినట్లు ఉండటంతో చింతలపూడి మండలం ఎర్రగుంటపల్లి ప్రభుత్వాస్పత్రికి వెళ్లారు. అక్కడ పరిస్థితి విషమించి మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు.

బంతిబంతికీ బెట్టింగ్..!



- ఉమ్మడి జిల్లాలో జోరుగా క్రికెట్ పందేలు
- ప్రపంచ కప్ నేపథ్యంలో
- రెచ్చిపోతున్న బుకీలు
- బైండోవర్‌లు, తనఖీలు లేని పరిస్థితి
- పోలీసుల నిర్లక్ష్యంపై సర్వత్రా చర్చ
- పలు జిల్లాల్లో ఎస్‌పిలే నేరుగా రంగంలోకి
- స్పెషల్ బ్రాంచ్ వైఫల్యమే కారణం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో క్రికెట్ బెట్టింగ్‌లు జోరుగా సాగుతున్నాయి. బంతిబంతికీ పందేలు కాస్తూ బుకీలు రెచ్చిపోతున్నారు. మ్యాచ్ మొదటి బంతి నుంచి ఆఖరి బాల్ వరకూ ఈ బెట్టింగ్‌ల జోరు కొనసాగడంతో కోట్లాది రూపాయలు చేతులుమారుతున్నాయి. ఇంతలా బెట్టింగ్‌లు జరుగుతున్నప్పటికీ పోలీసులు కనీసం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కోడి పందేల నుంచి అన్ని బెట్టింగ్‌ల్లోనూ ఉభయగోదావరి జిల్లాలు కేరాఫ్ అడ్రస్ మారుతున్నాయని పలువురు పేర్కొనడం విశేషం. సాధారణ క్రికెట్ మ్యాచ్‌లు జరిగేటప్పుడే బెట్టింగ్‌లు పెద్దఎత్తున సాగే జిల్లాలో ఇక ప్రపంచకప్ క్రికెట్ పోటీల నేపథ్యంలో బెట్టింగ్‌ల పరిస్థితి ఏ విధంగా ఉంటుందో వేరే చెప్పనక్కర్లేదు. క్రికెట్ బెట్టింగ్‌లు పెద్దఎత్తున జరుగుతాయని తెలిసినా పోలీసులు మాత్రం తమకు సంబంధంలేదన్నట్లు వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. గతంలో అనేక మంది క్రికెట్ బుకీలను పట్టుకుని చర్యలు తీసుకున్న పరిస్థితి ఉంది. ప్రపంచకప్ టోర్నీలు జరిగే సమయంలో గతంలో పట్టుబడిన క్రికెట్ బుకీలకు, అందుకు సహకరిస్తున్న వారిని ముందస్తుగా బైండోవర్ చేయడం, హెచ్చరించడంతోపాటు, నిరంతరం పోలీసుల నిఘా కొనసాగుతోంది. ఈనెల ఐదో తేదీన ప్రపంచకప్ క్రికెట్ టోర్నీ ప్రారంభమైంది. ఈసారి ఇండియాలోనే ప్రపంచ టోర్నీ జరుగుతోంది. దీంతో ఇండియా కప్ గెలవాలని సగటు భారతీయులంతా కోరుకుంటారు. మిగిలిన దేశాల మ్యాచ్‌లు జరిగినప్పుడుకంటే ఇండియా బరిలో దిగిన మ్యాచ్‌ల సమయంలో క్రికెట్ బెట్టింగ్‌లు రూ.కోట్లలో సాగుతాయి. ఇటీవల ఆదివారం జరిగిన ఇండియా, ఆస్ట్రేలియా మ్యాచ్‌పై రూ.కోట్లలో క్రికెట్ బెట్టింగ్‌లు జరిగినట్లు సమాచారం. పెద్దఎత్తున సొమ్ములు చేతులు మారినట్లు ప్రచారం సాగుతుంది. బుకీలు ఆన్‌లైన్ ద్వారా యువతను బెట్టింగ్‌ల ఉచ్చులోకి లాగుతున్నారు.

గతంలో క్రికెట్ బెట్టింగ్‌ల్లో సొమ్ములు పోగొట్టుకుని ఎంతోమంది యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. కొందరు యువకులు అప్పులపాలై ఆత్మహత్యలకు సైతం పాల్పడ్డారు. పెదవేగి మండలం భోగాపురం గ్రామానికి చెందిన నరేష్ అనే వ్యక్తి క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడి, భారీగా డబ్బుపోగొట్టుకుని చివరకు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇలాంటి అనేక ఘటనలు జిల్లాలో జరిగాయి. హోటల్ గదుల్లో, బడ్డికొట్టుల్లో ఎక్కడిపడితే అక్కడ క్రికెట్ బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. ఏ బంతికి ఎన్ని పరుగులు వస్తాయో కూడా బెట్టింగ్‌లు కడుతున్నారు. బెట్టింగ్‌ల ఉచ్చులోపడి ముఖ్యంగా చదువుకునే యువత తప్పుదోవ పడుతోంది. ప్రపంచ కప్ వంటి పెద్దటోర్నీ జరిగేటప్పుడు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన పోలీసులు అసలు పట్టన్నట్లు వ్యవహరించడం జనాల్లో చర్చనీయాంశంగా మారింది. పోలీసుల నిఘా కొనసాగుతుందన్న సంకేతాలు సైతం లేకుండాపోయాయి. దీంతో తమను ఎవరు ఆపేదంటూ బెట్టింగ్ రాయుళ్లు మరింత రెచ్చిపోతున్నారు. రాయలసీమ వంటి జిల్లాలో సైతం నేరుగా ఎస్‌పిలే రంగంలోకి దిగి తనిఖీలు నిర్వహిస్తూ క్రికెట్ బెట్టింగ్‌లపై ఉక్కుపాదం మోపుతున్నారు.

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో మాత్రం క్రికెట్ బెట్టింగ్‌లకు అడ్డుకట్ట వేసేవిధంగా ఎలాటి చర్యలూ తీసుకున్న పరిస్థితి కనిపించడం లేదు. దీంతో పోలీసులు ఇంత మౌనంగా ఉన్నారేంటి అంటూ పెద్దఎత్తున విమర్శలు జనాల్లో వ్యక్తమవుతున్నాయి. ఈనెల 14వ తేదీన ఇండియా-పాకిస్తాన్ మ్యాచ్ జరగనుంది. ఇక ఆ రోజు బెట్టింగ్‌ల రోజు పెద్దఎత్తున సాగనుందని అంచనా వేస్తున్నారు. పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోకపోతే అమాయక ప్రజలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. జిల్లాలోని అన్ని పట్టణ ప్రాంతాల్లోనూ క్రికెట్ బెట్టింగ్‌ల జోరు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ బెట్టింగ్‌లకు సంబంధించి ఉన్నతాధికారులకు సరైన సమాచారం అందించడంలో స్పెషల్ బ్రాంచ్ విభాగం విఫలమైందన్న చర్చ సైతం ప్రజల్లోనూ, పోలీసుల్లోనూ నడుస్తోంది.


ధృవపత్రాలు అందిస్తున్న కలెక్టర్

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం : కలెక్టర్


ప్రజాశక్తి - ఏలూరు

'జగనన్నకు చెబుదాం' స్పందనలో అందిన అర్జీలకు సత్వరపరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, జెడ్‌పి సిఇఒ కె.రవికుమార్, ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జివివి.సత్యనారాయణ, జిఎస్‌డబ్ల్యుఎస్ నోడల్ ఆఫీసరు రమణ హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో 414 అర్జీలను స్వీకరించామన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తులను నాణ్యతతోపాటు నిర్ధేశించిన సమయంలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని వివిధ గ్రామాల నుండి వివిధ సమస్యల పరిష్కారం కోసం అర్జీదారులు అందించిన వినతులను క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యతతో వాటి పరిష్కారానికి సంబంధించిన ఫొటోతో సహా అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అర్జీలను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని తెలిపారు. ప్రతీ సోమవారం మండల టీము అర్జీల ఆడిట్‌పై చర్చించారు. వివిధ సమస్యల పరిష్కారానికి తహాశీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజలను ఆరగంటకు మించి వేచిచూడకుండా చర్యలు తీసుకోవాలని తహాశీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం జిల్లా, మండల అధికారులతో జెసి మాట్లాడుతూ స్పందన అర్జీల్లో రీఓపెన్ అయిన వాటిని పెండింగ్‌లో ఉంచకుండా సత్వర పరిష్కారం చేయాలన్నారు. స్వమిత్వ సర్వేకు సంబంధించి పనులన్నీ వేగవంతం చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి, విలేజ్ సర్వేయర్, విఆర్‌ఒలు, ఇందుకు సంబంధించిన సర్వేని యుద్ధప్రాతిపదికన పూర్తిచేసేలా తహాశీల్దార్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఇకెవైసి, రీ సర్వే, రెవెన్యూ సర్వీసెస్‌కు సంబంధించిన అంశాలను పెండింగ్ లేకుండా చూడాలని తహాశీల్దార్లను ఆదేశించారు.

అందిన అర్జీల్లో కొన్ని..

కామవరపుకోట మండలం కళ్లచెరువుకు చెందిన ఎం.దుర్గాలక్ష్మీ అర్జీని ఇస్తూ తమ పేరున ఉన్న భూమిని సర్వేచేసి భూమిని ఆక్రమించుకోవడానికి ప్రత్నిస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ ఈ విషయంపై సంబంధిత తహాశీల్దారు, డిఎస్‌పి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేగేశ్న కృష్ణవేణి అర్జీని అందిస్తూ తన భర్త సత్యనారాయణ చేపల చెరువులో పడవ బోల్తాపడి ప్రమాదవశాత్తు మరణించారని తనకు సిఎంఆర్ఎఫ్ ఫండు మంజూరు చేసి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కొయ్యలగూడెం మండలం కుంతలగూడేనికి చెందిన షేక్ నజీమున్నీస తమ భూమి సర్వేకి సంబంధించిన పాస్ పుస్తకంలో రెండుసెంట్లు భూమి తక్కువ నమోదైందని దాన్ని సరిచేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరుతూ అర్జీ అందజేశారు. కైకలూరు మండలం ఆనందరావుపేటకు చెందిన జంగం హరిబాబు తమ భూమికి దారికి కొంతమంది అడ్డుపడుతున్నారని వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని అర్జీ అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.


మంత్రికి వినతిని అందిస్తున్న నాగలక్ష్మి

పారిశుధ్య సిబ్బంది నియామకానికి అనుమతివ్వండి

మంత్రి ఆదిమూలపు సురేష్‌కు వినతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీలో పారిశుధ్య సిబ్బంది నియమించడానికి అనుమతించాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి మున్సిపల్ శాఖమంత్రి ఆదిమూలపు సురేష్‌ని కోరారు. మంగళవారం విజయవాడలో ఆదిమూలపు క్యాంపు కార్యాలయం వద్ద నాగలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బంది కొరతతో గత నాలుగు సంవత్సరాలుగా మున్సిపాలిటీలో ఇబ్బందులు పడుతున్నామని మంత్రికి వివరించారు. శానిటేషన్ సిబ్బంది కొరత వల్ల పట్టణంలో పారిశుధ్య లోపం ఏర్పడుతుందన్నారు. 36 మంది పారిశుధ్య సిబ్బందిని నియమించుటకు ప్రభుత్వం నుండి అనుమతి ఇప్పించాలని కోరారు. అలాగే ఉమ్మడి జిల్లా వైసిపి కో ఆర్డినేటర్ ప్యానల్ స్పీకర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సహకారంతో రూ.రెండు కోట్లు బిటి రోడ్డు మంజూరు చేయాలని సురేష్‌ను కోరారు. ఈ విన్నపాలపై ఆయన సానుకూలంగా స్పందించారని నాగలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు మున్సిపల్ వైస్‌ఛైర్‌పర్సన్ కంచర్ల వాసవిరత్నం, పట్టణ అధ్యక్షులు అచ్యుతరామయ్య పాల్గొన్నారు.

దిశా ఎస్ఐగా క్రాంతిప్రియ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్


అదనపు ఎస్‌పిని కలిసిన క్రాంతిప్రియ

దిశ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా క్రాంతి ప్రియ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆమె పిసిఆర్ కంట్రోల్ రూము ఎస్ఐగా పనిచేస్తున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆమెను ఏలూరు దిశ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. సోమవారం ఆమె ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా అదనపు ఎంజెబి.భాస్కర్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దిశా పోలీస్ స్టేషన్ ముఖ్యలక్ష్యాన్ని పూర్తిస్థాయిలో నిర్వహించాలని ఆమెకు సూచించారు. దిశ యాప్ పట్ల మహిళలకు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎల్లవేళలా వారికి పోలీసు శాఖ తరపున భరోసా కల్పించే విధంగా నడుచుకోవాలని సూచించారు. అనంతరం క్రాంతిప్రియ మాట్లాడుతూ తనకు కేటాయించిన విధులను పూర్తిస్థాయిలో నిర్వహించేందుకు కృషి చేస్తానని తెలిపారు. మహిళల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన దిశా చట్టం అమలులో ముందుంటానని ఆమె తెలిపారు.

ఎయిడ్స్‌పై విస్తృత అవగాహన


ప్రజాశక్తి - ఏలూరు

హెచ్ఐవి/ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ 'నేషనల్ యూత్ ఫెస్ట్ -2023'లో భాగంగా రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాలల విద్యార్థులకు 5కె రెడ్ రన్', జెపిహెచ్ స్కూల్ విద్యార్థులకు జిల్లాస్థాయి క్విజ్ పోటలు నిర్వహించామని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ జి.రత్నకుమారి తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి సోమవారం బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ నాగేశ్వరరావు, డిఇఒ శ్యామ్ సుందర్ పాల్గొన్నారు. 5కె మారథాన్ రెడ్ రన్' పరుగు పందెంలో ఏలూరు జిల్లా నుంచి పాల్గొన్న వారిలో స్థానిక సర్ సిఆర్ రెడ్డి కలశాలకు చెందిన బి.మోహన్, పి.సాయిరామ్ మొదటి, ద్వితీయ స్థానాలు సాధించారు. ఏలూరు కోటదిబ్బ డిగ్రీ కళాశాల విద్యార్థి పి.సాయికుమార్ తృతీయ స్థానం సాధించాడు. అదేవిధంగా జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో స్థానిక శనివారపుపేట ఉన్నత పాఠశాలకు చెందిన వైష్ణవి, తనూష ప్రథమస్థానం సాధించారు. మాదేపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.జాన్ బాబు, జి.క్రిస్పస్‌కు ద్వితీయ స్థానం, జంగారెడ్డిగూడెం ఉన్నత పాఠశాలకు చెందిన కుమారి ఎస్.శ్రీప్రియ, జి.విశేషకృష్ణకు తృతీయస్థానం లభించింది. వీరితోపాటు నూజివీడు, మీర్జాపురం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎల్.జోయసీ రాణి కుమారి జి.త్రివేణికి ప్రోత్సాహక బహుమతులు లభించాయి.

భూ పంపిణీలో ఉమ్మడి పశ్చిమను చేర్చాలి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - ఏలూరు


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

వచ్చే దీపావళికి రాష్ట్ర ప్రభుత్వం భూ పంపిణీ చేస్తామని ప్రకటించిందని అయితే అందులో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా లేదని, అందులో ఈ జిల్లాను చేర్చాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ముఖ్యకార్యకర్తలు, మండల అధ్యక్ష, కార్యదర్శులు, గ్రామ కార్యదర్శులకు జిల్లాస్థాయి రాజకీయ శిక్షణా తరగతులు స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ప్రారంభించారు. తొలుత సంఘం జెండాను జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం ఆవిష్కరించారు. అనంతరం శిక్షణా తరగతులను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దీపావళికి భూ పంపిణీ చేస్తామని, భూమిలేని పేదలందరికీ రాష్ట్రవ్యాప్తంగా 60 వేల ఎకరాలు పంచుతామని ప్రకటించిందన్నారు. కానీ దీనిలో ఉమ్మడి జిల్లాలో భూపంపిణీ చేయకపోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గోదావరి జిల్లాల నుండి అత్యధికమంది వలసలుపోతుంటే ప్రభుత్వం మాత్రం పేదలకు భూపంపిణీలో ఈ జిల్లా లేకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికే జిల్లాలో వందలాది ఎకరాలు ప్రభుత్వ, అసైన్డ్, సీలింగ్ భూములు భూస్వాముల చేతుల్లో ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భూ పంపిణీలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలను కూడా చేర్చాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం ఉపాధి చట్టంలో సరికొత్త సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. ఉపాధి హామీ చట్టానికి రూ.200 కోట్లు నిధులు కేటాయించి, 200 రోజులు పనులు కల్పించాలని కోరారు.

సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల వల్ల పేదలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు. వ్యవసాయ కార్మికుల పండించిన పంటలో వాటా రైతు పొందుతుంటే మరోపక్క ప్రభుత్వాలు సంస్కరణ పేరుతో గుంజుకుంటున్నాయన్నారు. అసలైన వ్యవసాయ కార్మికుడికి కనీస వేతనం అందడం లేదని తెలిపారు. ఓ పక్క వర్షపాతం తక్కువగా ఉండటంతో రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో కరువు మండలాలను ప్రభుత్వం ప్రకటించిందని, ఈ జిల్లాలో 14 మండలాల వర్షపాతం తక్కువగా ఉన్నప్పటికీ కరువు సమస్యపై ప్రభుత్వం స్పందించకపోవడం, జిల్లా అధికారులు మాట్లాడకపోవడం సిగ్గుచేటమన్నారు. ఈ తరగతులకు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తామా ముత్యాలమ్మ, సహాయ కార్యదర్శి ఎస్.మహంకాళిరావు, యు.వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు ఎ.ప్రభాకర్, వై.సీత, కె.దుర్గ, రవీందర్, దాసు, మాధవ, సుబ్బారావు, జి.సత్యనారాయణ పాల్గొన్నారు.


దీక్షను ప్రారంభిస్తున్న విజయలక్ష్మి

స్కూల్ స్వీపర్ల పట్ల నిర్లక్ష్య వైఖరి తగదు

అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.విజయలక్ష్మి

- ఏడో రోజుకు దీక్షలు
- మోకాళ్లపై నిలబడి నిరసన

ప్రజాశక్తి - ఏలూరు

స్కూల్ పిల్లల మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజనం ప్లేట్లు, వారి గదులు, వరండాలు శుభ్రం చేసే స్వీపర్ల జీతాల పట్ల విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరివీడి బకాయి జీతాలు చెల్లించాలని అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.విజయలక్ష్మి డిమాండ్ చేశారు. డిఇఒ కార్యాలయం వద్ద చేపట్టిన మున్సిపల్ స్కూల్ స్వీపర్ల ఏడో రోజు రిలే నిరాహార దీక్షలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. అనంతరం విజయలక్ష్మి మాట్లాడుతూ స్కూల్స్ పరిశుభ్రతలో కన్నతల్లి కన్నా ఎక్కువగా పాటుపడే స్కూలు ఆయాల జీతాలు చెల్లించడంలో విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించడం సరైంది కాదన్నారు. మున్సిపల్ స్కూల్స్‌ను విద్యాశాఖకు బదిలీ చేసి 15 మాసాలవుతున్న విద్యాశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని ఆమె విమర్శించారు. నాలుగైదు రోజులు జీతాలు ఆలస్యమైతే గగ్గోలుపెట్టే ప్రభుత్వ ధికారులు స్కూల్ స్వీపర్లకు ఐదు నెలలుగా జీతాలు చెల్లించకపోతే ఎలా బతుకుతారని ఆమె ప్రశ్నించారు. ఏలూరు నగరపాలక సంస్థ స్కూల్ స్వీపర్లు 62 మందికి రావాల్సిన ఐదు నెలల బకాయి జీతాలను వెంటనే చెల్లించి ఆదుకోవాలని, ఆకలి బాధలనుండి స్కూల్ స్వీపర్లను కాపాడాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. లేని పక్షంలో ఇతర సంఘాలను కలుపుకుని ఆందోళనను ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి స్కూల్ స్వీపర్ల యూనియన్ నగర అధ్యక్షురాలు జె.స్వాతి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి, విజయలక్ష్మి, హఫీజ్ ఉన్నీసా, చిట్టెమ్మ, రామలక్ష్మి, భాస్కర్, మాధవి, లక్ష్మి, వెంకటరమణ, రమణమ్మ పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న ఎఎన్‌ఎంలు, నాయకులు

పిహెచ్‌సి వైద్యురాలిపై చర్యలు కోరుతూ ధర్నా

ప్రజాశక్తి - లింగపాలెం

సచివాలయ ఎఎన్ఎం శర్వాణి ఆత్మహత్యాయత్నానికి కారకులైన మెడికల్ ఆఫీసర్ సంధ్యారాణిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ లింగపాలెం పిహెచ్‌సి వద్ద పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. పిహెచ్‌సిలో పనిచేస్తున్న ఎఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా వర్కర్లు, ఇతర సిబ్బంది పిహెచ్‌సి వద్ద నిరసన తెలిపారు. ఆందోళనలో శర్వాణి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ మెడికల్ ఆఫీసర్ ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బంది పట్ల అమానుషంగా ప్రవర్తిస్తున్నారని దాని ఫలితంగానే ఎఎన్ఎం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసన శిబిరం వద్దకు జిల్లా డిప్యూటీ వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆశ వచ్చి ఆందోళనకారులతో మాట్లాడారు. కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శర్మిష్టతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ ఆందోళనలో యూనియన్ నాయకులు నల్ల అప్పారావు, అమర్, పి.కుమారి, కె.పాప, పి.పద్మ, జి.సుహాసిని, కె.వెంకటలక్ష్మి, కె.ప్రభావతి, నత్త జ్యోతి పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న విద్యావాలంటీర్లు, నాయకులు

కోయ మాతృ భాషా విద్యావాలంటీర్ల బకాయిలు చెల్లించండి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

కోయ మాతృ భాషా విద్యా వాలంటీర్ల బకాయి వేతనాలు చెల్లించాలని ఆదివాసీ గిరిజన, మాతృ భాషా విద్యా వాలంటీర్ల సంఘాల జిల్లా కమిటీలు డిమాండ్ చేశాయి. సోమవారం మండలంలోని కోటరామచంద్రపురం ఐటిడిఎ కోయ మాతృ భాషా విద్యా వాలంటీర్ల వేతన బకాయిలివ్వాలని ఆదివాసీ గిరిజన సంఘం మాతృ భాషా విద్యా వాలంటీర్ల సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, కోయ మాతృ భాషా విద్యా వాలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షులు కుంజా నవీన్ మాట్లాడుతూ 2021-22లో ఐటిడిఎ పరిధిలో 101 పాఠశాలల్లో మాతృ భాష విద్యను బోధించిన వాలంటీర్లకు రెండు నెలల వేతనాలు బకాయిలున్నాయన్నారు. అనంతరం వినతిపత్రాన్ని ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజకు అందజేశారు. ఈ సమస్యలపై ఆయన మాట్లాడుతూ 2021-22లో ఒక నెల వేతనం ఇస్తామని, మిగిలిన బకాయి వేతనాలు త్వరలో అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యా వాలంటీర్లు పాల్గొన్నారు.


యువతకు చే గువేరా స్ఫూర్తి

ప్రజాశక్తి - ఏలూరు

చేగువేరా స్ఫూర్తితో యువత ఉద్యమించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో చేగువేరా 56వ వర్ధంతి సభ జరిగింది. చేగువేరా చిత్రపటానికి కృష్ణ చైతన్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ చేగువేరా అంతర్జాతీయ విప్లవ కెరటం, గొప్ప మానవతావాది అని కొనియాడారు. జీవితపు చివరి క్షణం వరకూ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. 'చే' జీవితం అంటేనే సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటమని క్యూబా విప్లవోద్యమ నేత అని అన్నారు. ప్రపంచంలో ఎక్కడ అన్యాయం జరిగినా తీవ్రంగా ప్రతిఘటించే లక్షణం ప్రతి విప్లవకారుడికి ఉండాలని 'చే' ప్రకటించారన్నారు. పెట్టుబడిదారీ విధానాలకు వ్యతిరేకమైన ప్రత్యామ్నాయాలను రూపొందించడంలో ప్రపంచానికే మార్గదర్శి అయ్యారని, చేగువేరా స్ఫూర్తితో నేటి యువత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నేడు పెట్టుబడిదారీ ప్రపంచాన్ని ఆర్థిక సంక్షోభం అతలాకుతలం చేస్తుందన్నారు. దీని ఫలితంగా ప్రజల జీవితాలు చిన్నాభిన్నమవుతున్నాయని విమర్శించారు. ప్రపంచంలో సోషలిస్టు రాజ్యాన్ని ఏర్పరచడం కోసం చేగువేరా చేసిన ఉద్యమాలు అనిర్వచనీయమన్నారు.

ముందే చిగురించిన వేప..

ప్రజాశక్తి - కలిదిండి



ముందుగానే చిగురించిన వేప

కాల క్రమంలో ప్రకృతికి అనుగుణంగా చెట్లకు పువ్వులు పూయడం సహజ లక్షణం. ఉగాది పండగ సమయానికి వేప చెట్లకు వేప పువ్వు పూయడం, తెలుగు వారి కొత్త సంవత్సరం నాడు ఉగాది పచ్చడి లోని ఆరు రుచులలో వేప పువ్వుకు ప్రత్యేక స్థానం ఉంది. కానీ కాలానికి భిన్నంగా ఓ వేప చెట్టు కొమ్మకు వేప పువ్వు ముందే పూసింది. ప్రధాన సెంటర్‌లోని ఐర్రిరాజు కాంప్లెక్స్ వెనుక ఖాళీ స్థలం ఆవరణలో వేప చెట్టుకు(ఒక కొమ్మకు మాత్రమే) వేప పువ్వు పూసింది. ఉగాదికి ఆరు నెలల ముందుగానే పూయడం విశేషం.

నేడు ఉంగుటూరుకు పౌర సరఫరాల శాఖ ఎమ్‌డి

ప్రజాశక్తి - ఉంగుటూరు

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మేనేజింగ్ డైరెక్టర్ వీరపాండ్యన్ ఈనెల 10న ఉంగుటూరు మండలంలో పర్యటించనున్నారు. వరి కోతలు ప్రారంభమై ధాన్యం సిద్ధమవుతున్న తరుణంలో ధాన్యం సేకరణపై సంబంధిత అధికారులతో తొలుత సమీక్షించనున్నారు. అనంతరం రైతు భరోసా కేంద్రాన్ని, ధాన్యం నిల్వలను ఆయన పరిశీలించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ఉంగుటూరు మండలంలోనే ప్రతి ఈసీజన్‌లో దిగుబడులు రావడంతో ధాన్యం సేకరణలో ఇబ్బందులు లేకుండా, చర్యలు తీసుకోవాల్సి ఉంది. వెల్లమిల్లి 1, 2, నాచుగుంట, ఉంగుటూరు 1, 2 రైతు భరోసా కేంద్రాల పరిధిలో ఇప్పటి వరకూ 200 ఎకరాలకు పైగా వరి కోతలు పూర్తై, సుమారు 8,400 బస్తాల వరకూ ధాన్యం ఎగుమతులకు కోసం సిద్ధంగా ఉంది.

పంట నమోదు చేయించుకోవాలి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

రైతులందరూ తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవడంతో పాటు ఆర్‌బికెల్లో ఈకెవైసి చేయించుకొని ధాన్యం విక్రయాలల్లో ఎటువంటి ఇబ్బందులు పడకుండా చూసుకోవాలని నూజివీడు సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ కోరారు. సోమవారం మండల పరిధిలోని వడ్లమాను గ్రామంలో పంట నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించి వ్యవసాయ, ఉద్యానశాఖ సహాయకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎ.ఉదయభాస్కరరావు, వ్యవసాయాధికారి పి.చెన్నారావు, విస్తరణాధికారి కె.ధనబాబు, విఆర్ఒ నాగరాజులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - చాట్రాయి

పర్వతాపురం గ్రామంలో డ్రైనేజీ సమస్య ముందుగానే గ్రహించి, ప్రతి కాలనీలో సర్పంచి శివరామకృష్ణ డ్రైనేజీలు నిర్మించారు. ఇప్పుడు ఎవరికి వారు వాళ్ళ ఇంటి ముందు మేరవ కనిసం మట్టిని పోసి డ్రైనేజీని పూడ్చి వేసేశారు. ఈ సమస్యతో కొన్ని కుటుంబాలు ఇబ్బంది పడుతుండగా, దీన్ని గ్రహించి సమస్యను తొలిగేలాగా మరల డ్రైనేజీని సర్పంచి సోమవారం తీయించారు. ఈ సందర్భంగా సర్పంచి శివరామకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఇంటి ముందు డ్రైనేజీ శిల్ట్ మీ ఇళ్ల ముందు ఉండకూడదని, ఒకవేళ ఉంటే మీకే నష్టం కలుగుతుందని మలేరియా, డెంగీ, టైఫాయిడ్ జ్వరం, అనేక వ్యాధులు వస్తాయని తెలిపారు.

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు

మండవల్లి : దసరా మహోత్సవాలను దత్తాశ్రమంలో అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి గురజాడ ఉదయ్ శంకర్ తెలిపారు. లోకముడిలోని దత్తాశ్రమంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గణపతి సచ్చిదానంద స్వామి ఆశీస్సులతో ముసునూరు లేవనిర్వహణ దత్తాశ్రమంలో దసరా మహోత్సవాలు, కోటి కుంకుమార్చన పూజలు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 15 నుంచి 24 వరకు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని మైసూరు దత్తపీఠ గణపతి ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తారని ప్రతి దినం ఉదయం 8 గంటల నుంచి వైభవోపేతంగా నిర్వహిస్తామన్నారు. ఈ బృహత్తర కార్యక్రమంలో 600 నుంచి 1000 మంది వరకు స్త్రీ, పురుషులు పాల్గొని రోజుకు 10 లక్షల సార్లు నామార్చన చేస్తున్నట్లు వివరించారు. భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు. అనంతరం కార్యక్రమ సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కొండేటి వెంకట సత్యనారాయణ, ఆర్‌విఎస్ సూర్యనారాయణ, కె.శివప్రసాద్, హరి మోహన్, రాజేంద్ర ప్రసాద్, వి.శ్రీనివాసరావు, జవాది మురళీ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

భర్త వేధిస్తున్నాడని ఫిర్యాదు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పెళ్లి చేసుకొని భర్త వేధింపులకు గురి చేస్తున్నాడని వివాహిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని వంకవారిగూడెం గ్రామానికి చెందిన ఓ మహిళను అదే గ్రామానికి చెందిన వంశీ అనే వ్యక్తి నాలుగు సంవత్సారాల క్రితం పెళ్లి చేసుకున్నాడన్నారు. కొంతకాలం కాపురం చేసిన తర్వాత మద్యానికి బానిసై శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నాడని మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గంజాయి కేసులో వ్యక్తికి రిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పలు గంజాయి కేసులలో నిందితుడిగా ఉన్న మోజస్‌కు కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది. ఏలూరు మూడో పట్టణ పోలీసులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా పట్టుకుని కోర్టులో హాజరు పరచిన ఘటన ఏలూరు నగరంలో సోమవారం చోటుచేసుకుంది. సంబంధిత వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని వట్లూరు సమీపంలో వల్లాల మోషేరావు అలియాస్ మోజస్ అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి గత కొంతకాలంగా ఇక్కడే నివాసం ఉంటున్నాడు. గుంటూరు జిల్లాకు చెందిన ఇతను గత కొంతకాలంగా ఇక్కడకు మకాం మార్చాడు. అప్పటి నుంచి ఇతను పలు ప్రాంతాల నుంచి గంజాయిని ఏలూరు నగరానికి రప్పించి, స్థానికంగా అమ్మకాలు జరుగుతున్నట్లు పోలీసులు సమాచారం అందుకున్నారు. మార్చి, ఆగస్టులో ఇతనిపై రెండు కేసులు నమోదు అయ్యాయి. అయితే అప్పటి నుంచి ఇతను పరారీలో ఉన్నాడు. ఏలూరు ఎంఆర్ఓ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మోజస్‌ను ఆదివారం సాయంత్రం మూడో పట్టణ సిఐ శివాజీ సంయుక్తంగా పట్టుకొని, అతనిని సోమవారం రిమాండ్‌కు తరలించారు. న్యాయమూర్తి 14 రోజులపాటు రిమాండ్‌ను అతనికి విధించారు.

నాటుసారా విక్రేతలపై చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి


నాటుసారా తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవని ఆగిరిపల్లి ఎస్ఐ ఎన్.చంటిబాబు హెచ్చరించారు. మండల పరిధిలోని వట్టిగుడిపాడు గ్రామంలో నాటుసారా తయారు చేస్తున్న అనంత వెంకటేశ్వరరావు అనే వ్యక్తిని అదుపులోనికి తీసుకొని, అతని వద్ద నుంచి 30 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని, 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వసం చేశారు. అనంతరం వెంకటేశ్వరరావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లుగా ఆయన తెలిపారు. ఈ దాడిలో కానిస్టేబుల్స్ వి.మధుసూధనరావు, కె.రామాంజనేయులు పాల్గొన్నారు.

మహిళను రక్షించిన పోలీసులు

ఏలూరు స్పోర్ట్స్ : నవమసాలు మోసి, కని పెంచిన కుమారుడు తనను సరిగా పట్టించుకోవడం లేదని తీవ్ర మనస్థాపానికి గురైన తల్లి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. అయితే పోలీసులు సమయస్ఫూర్తితో వ్యవహరించి ఆమెను రక్షించి తిరిగి ఇంటికి చేర్చిన ఘటన ఏలూరు నగరంలో చోటుచేసుకుంది. గొల్లగూడెం సన్ సిటీ ప్రాంతానికి చెందిన సిహెచ్.శ్రీదేవి భర్త పిల్లలతో కలిసి జీవిస్తుంది. గత కొంతకాలం క్రితం కుమారుడు ప్రేమ వివాహం చేసుకుని అప్పటి నుంచి తనను సరిగా పట్టించుకోవడం లేదని ఆ తల్లి ఆవేదనతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడింది. మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో మహిళ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న గౌరీ, సతీష్‌లు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని ఆమెను రక్షించి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఆమె కుమారుడికి కౌన్సెలింగ్ ఇచ్చి, ఆమెను ఇంటికి పంపారు. దీంతో కానిస్టేబుల్‌లను మూడో పట్టణ సిఐ అభినందించారు.

ఆరోగ్య సురక్షతో పేదలకు మేలు

ప్రజాశక్తి - టి.నరసాపురం



ఉంగుటూరులో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతిఒక్కరికి మేలు చేకూరుతుందని తహశీల్దార్ జెవి.సుబ్బారావు తెలిపారు. మండలంలోని మక్కినవారి గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో డెంగ్యూ, మలేరియా, బిపి, షుగర్ వంటి 9 రకాల రక్త పరీక్షలు నిర్వహించి 150 రకాల మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కళ్లజోళ్ళ ఆపరేషన్‌ల కొరకు సిఫార్సు చేసినట్లు ఆయన తెలిపారు. పేద కుటుంబాలకు జగనన్న ఆరోగ్య సురక్ష వరం లాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారులు ఫణీంద్ర బాబు, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : గోపీనాథపట్నం సచివాలయం పరిధిలోని తిమ్మయ్యపాలెం, కొత్తగూడెం, గోపీనాథపట్నం గ్రామస్తులకు సోమవారం జగనన్న ఆరోగ్య సురక్షా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఎంపిడిఒ నందిపాటి ప్రేమాన్విత శిబిరాన్ని ప్రారంభించారు. చేబ్రోలు పిహెచ్‌సి వైద్యులు కెఎస్.వర్మ ఆధ్వర్యంలో ఇతర వైద్యులు సేవలందించారు. 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఒకరికి గుండె సంబంధిత వ్యాధి కారణంగా మెరుగైన వైద్య చికిత్సకు సిఫార్సు చేశారు. గోపీనాథపట్నం, తిమ్మయ్యపాలెం సర్పంచులు పుత్సకాయల విష్ణుమూర్తి, సింహాద్రి శ్రీదేవి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు సింహాద్రి సత్యనారాయణ, పంచాయతీ, సచివాలయం కార్యదర్శులు, సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతలపూడి : ప్రతిఒక్కరికి జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఉచిత వైద్యం అందిస్తున్నట్లు సర్పంచి గాయం మల్లేశ్వరి తెలిపారు. మండలంలోని సీతానగరం సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎంపిడిఒ మురళీకృష్ణ అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటినీ సందర్శించి, ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఉచిత మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి కలవకొండ రాంబాబు, చింతంపల్లి సర్పంచి తాండ్ర రామకృష్ణ, మాజీ ఎంపిటిసి తమ్మిశెట్టి శ్రీను, చందా శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల : మండలంలోని పంగిడిగూడెం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గోపాలపురం ఎంఎల్‌ఎ తలారి వెంకట్రావు హాజరయ్యారు. వైద్య శిబిరాల్లో మెడికల్ సిబ్బంది అందరికీ ఉచిత వైద్య పరీక్షలు చేశారు. మెడికల్ సిబ్బంది ఏర్పాటు చేసిన స్టాల్‌లను ఎంఎల్ఎ, యువనేత బొండడ వెంకన్నబాబు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి చిగురుపల్లి సామ్యూల్, స్థానిక సర్పంచి ప్రత్తిపాటి యాహోను, గుమ్మడి శ్రీను, బోరుగడ్డ రాజు, బోళ్ల శ్రీను, మండల సచివాలయాల కన్వీనర్ చిన్ని, డీజే, ఎండిఒ తిరుపతి రావు, మెడికల్ సిబ్బంది, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముసునూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామస్తులకు ఎంతో ఉపయోగపడుతుందని ఎంపిడిఒ జి.రాణీ తెలిపారు. సోమవారం చింతలవల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమం సర్పంచి పిల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 409 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించిన్నట్లు వైద్యులు యం.కిరణ్‌కుమార్, డాక్టర్ కరిముల్లా, ఇఒపిఆర్‌డి బసవరాజు అచ్యుత సత్యనారాయణ, సూపర్‌డెంట్ కూచిపూడి సాయిరామ్, సీనియర్ అసిస్టెంట్ యస్.శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ సన్నీరాజన్, పంచాయతీ కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశాలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ముదినేపల్లి : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ తెలిపారు. మండలంలోని సింగరాయపాలెంలో సోమవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలోని పేదలకు ఉచిత వైద్య సేవలు అందిచేందుకు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాలను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె.శ్రీనివాస్, సింగరాయపాలెం, అల్లూరు, చేవూరు గ్రామాల సర్పంచులు బోయిన విమలారామరాజు, శీలం రామకృష్ణ, వల్లభనేని లక్ష్మీ, వైసిపి నాయకులు కె.గోవర్ధన్, కుమార్, సతీష్, కిషోర్, కొండ, వి.వెంకటేశ్వరరావు, వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వితంతు పింఛను ఇప్పించండి

చాట్రాయి : మండలంలోని చిత్తపూరు గ్రామానికి చెందిన మునేటి శిరీష వితంతు పింఛను ఇప్పించాలని స్పందన కార్యక్రమంలో మండల తహశీల్దార్ సిహెచ్ .విశ్వనాథరావుకు అర్జీ సమర్పించారు. తన భర్త శ్రీనివాసరావు 2021 మే 23వ తేదీన చనిపోయాడని, 2022 నవంబర్‌లో వితంతు పింఛన్‌కు అర్జీ పెట్టుకొన్నాని తెలిపారు. కానీ తనకు వితంతు పింఛన్ మంజూరు కాలేదని, ఇప్పటికీ ఎన్నోసార్లు వితంతు పింఛన్‌కి అర్జీ పెట్టుకున్నా, ఫలితం లేకుండా పోయిందన్నారు. ఆన్‌లైన్‌లో పింఛన్ అప్రూవల్ అయిందని చెబుతున్నారు తప్ప డబ్బులు ఇవ్వటం లేదని, అర్హత ఉండి కూడా వితంతు పింఛన్ రాకపోవడంతో కూలీ పనులు చేసుకుని పిల్లల్ని పోషించుకుంటున్నానని తెలిపారు. సిపిఎం అనుబంధ వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం నాయకులు కొమ్ము ఆనందం మునేటి శిరీషతో సోమవారం తహశీల్దార్‌కు అర్జీ సమర్పించారు. వెంటనే సమస్యను పరిష్కరించి, పింఛను మంజూరు చేయాలని, లేని పక్షంలో ఆందోళన చేపడతామని కొమ్ము ఆనందం తెలిపారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో నూజివీడు విద్యార్థుల ప్రతిభ

నూజివీడు రూరల్ : పట్టణంలోని జెడ్‌పి బాలిక హైస్కూల్ విద్యార్థులు బాస్కెట్‌బాల్ పోటీలలో ప్రతిభ కనబరచడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు వివిఎన్.సత్యనారాయణ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం మాట్లాడుతూ బేతాళ ప్రభు దీపిక చెన్నైలో నిర్వహించిన సీనియర్ నేషనల్ విన్నర్‌గా, చాట్రాతి నిఖిల, మరికొందరు బాలికలు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి అందరి మన్ననలను పొందారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సహచర విద్యార్థినులు వారిని అభినందించారు.

ద్వారకాతిరుమలలో ఉచిత వైద్యశిబిరం

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమలలో స్థానిక ద్వారకా రెసిడెన్సీ కళ్యాణ మండపం వద్ద మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, ద్వారకాతిరుమల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మణిపాల్ హాస్పిటల్ విజయవాడ వారు ఉచిత మెగా వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ క్యాంప్‌లో షుగర్, బిపి, ఇసిజి టెస్టులు చేశారు. పూర్తి సాంకేతిక పరికరములు గల ఎసి వాల్వా బస్సు నందు ఆడవారికి అవసరమైన టెస్టులు, క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టు నిర్వహించారు. ఈ ఉచిత మెడికల్ క్యాంప్‌ను గ్రామప్రజలు ఉపయోగించుకోవాలని, రాబోయే రోజుల్లో మరిన్ని మెడికల్ కాంప్‌లు నిర్వహిస్తామని లయన్స్ క్లబ్ జోన్ ఛైర్‌పర్సన్ వంటిపల్లి విఎస్ఆర్‌పివి ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ద్వారకాతిరుమల లయన్స్ క్లబ్ అధ్యక్షులు గంజి కాశీ విశ్వనాథం, మానవత అధ్యక్షులు చిలుకూరి సుబ్రహ్మణ్యం, మణిపాల్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో యమున ప్రతిభ

ఏలూరు : భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను యువత, విద్యార్థులకు చేరువ చేయాలనే సంకల్పంతో రామాయణం, మహాభారతం, భాగవతాల ఇతివృత్తంగా తీసుకుని క్రియేటివ్ హార్ట్స్ ఆకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లో పోటీలు నిర్వహించారు. చిత్రలేఖనం పోటీల్లో శనివారపుపేట, జెడ్‌పిహెచ్ స్కూల్ విద్యార్థి ఆర్.యమున ఆరో తరగతి అమలాపురంలో ఇంటర్‌నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఛైర్మన్ ఎన్.మనువిహార్ చేతులమీదుగా బహుమతిని అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎం జి.ప్రకాష్‌రావు, విజేతను, చిత్రలేఖన ఉపాధ్యాయులు ఎమ్‌డి.ఇర్షాద్ అహ్మద్‌ను అభినందించారు.

సమాచార చట్టంపై అవగాహన కల్పించాలి

ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు

ప్రజాశక్తి - మండవల్లి



తహశీల్దార్‌కు వినతి అందిస్తున్న భాస్కరరావు

సమాచార హక్కు చట్టంపై అవగాహన లేకపోవడం వల్ల ప్రజలు సద్వినియోగం చేసుకోలేకపోతున్నారని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు స్పష్టం చేశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కె.గోపాల్‌కు వినతి అందించి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చి 18వ వార్షికోత్సవం జరుపుకుంటున్నామన్నారు. అయినప్పటికీ సమాచార హక్కు చట్టంపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన లేదన్నారు. అందువల్ల సక్రమంగా వినియోగించుకోలేకపోతున్నామని ఆయన తెలిపారు. అంతేకాకుండా మండలంలోని పలు కార్యాలయాలలో సమాచారహక్కు చట్టం బోర్డులు కూడా లేకపోవడం, సంబంధిత అధికారుల ఫోన్ నెంబర్లు ఉండడం లేదని విమర్శించారు. సమాచార హక్కు చట్టం సెక్షన్ 4(1)బి చట్టానికి గుండె లాంటిదని ఇందులో 17 అంశాలతో పాటు అధికారుల వివరాలు, వారి విధులు, బాధ్యతలు కార్యాలయానికి వస్తున్న నిధులు, వాటి ఖర్చుల వివరాలు ప్రజలకు స్వచ్ఛందంగా తెలియచేయాలని నిబంధన ఉన్నప్పటికీ ఆ విధంగా ఎక్కడా జరగడం లేదని తెలిపారు. అంతేకాకుండా ప్రతినెలా మూడవ శుక్రవారం కార్యాలయాల్లో ఆర్‌డిఐ దినంగా నిర్వహించాలని ప్రకటించినప్పటికీ అది కూడా ఎక్కడా అమలు కాకపోవడం బాధాకరమన్నారు. ప్రజలకు సమాచారాన్ని దాచిపెడితే ఎన్నో అవమానాలు వస్తాయని, ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తే అపోహలకు తావు లేకుండా పారదర్శకంగా ఉంటుందని ఆయన తెలిపారు. ఇప్పటికైనా ప్రజలకు, విద్యార్థులకు సమాచార చట్టంపై అవగాహన కలిగించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం మండల అధ్యక్షులు టి.అప్పారావు, కార్యవర్గ సభ్యులు బండి రంగారావు, పొన్నూరు రామచంద్రరావు, వెలగపల్లి బేబీ సరోజిని పాల్గొన్నారు.

మక్కినవారిగూడెం హైస్కూల్లో ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను పరిశీలిస్తున్న తహశీల్దారు సుబ్బారావు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని మక్కినవారిగూడెం జడ్‌పి హైస్కూల్లో సోమవారం తహశీల్దార్ జెవి.సుబ్బారావు ఆక్రమణలను తొలగించారు. హైస్కూల్ గ్రౌండ్‌లో స్థలాన్ని స్థానికులు కొందరు ఆక్రమించి పశువులను కట్టేస్తుండడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పాఠశాల హెచ్‌ఎంఎల్.వెంకటేశ్వరరావు పలుమార్లు ఆక్రమణదారులను హెచ్చరించినప్పటికి వారి తీరు మారకపోవడంతో తహశీల్దార్‌కి ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ, పోలీసు సిబ్బందితో కలిసి తహశీల్దార్ ఆక్రమణల తొలగింపుకు చర్యలు చేపట్టారు. ఆక్రమణలు తొలగించి పాఠశాల గ్రౌండ్‌లో ఎటువంటి ఆక్రమణలు చేపట్టకుండా ఉండేందుకు ఇటుకలతో గోడ నిర్మాణానికి ఆదేశాలు జారీ చేయడంతో, పాఠశాల సిబ్బంది గోడ నిర్మించారు.

ఉపాధ్యాయుల ఖాళీ పోస్టులు భర్తీ చేయండి

ప్రజాశక్తి - కలిదిండి



ఎమ్‌డిఒకు వినతిని అందిస్తున్న శ్రీనివాసరావు

మండలంలోని మట్టగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సరిపడా ఉపాధ్యాయులు లేని కారణంగా విద్యార్థులు పలు ఇబ్బందులకు గురవుతున్నారని టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు తెలిపారు. పాఠశాలలోని అన్ని తరగతులకు సోషల్, హిందీ ఉపాధ్యాయులు మాత్రమే బోధన చేస్తున్నారన్నారు. మిగిలిన సబ్జెక్టులకు తరగతుల వారీగా ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు చదువులో వెనక బడుతున్నారన్నారు. నాడు - నేడుతో విద్యారంగానికి పెద్ద పీట వేశామని గొప్పగా చెప్పడమే కానీ, ఉపాధ్యాయులు లేని కొరత విద్యార్థుల విద్యకు తూట్లు పొడుస్తోందన్నారు. ఆయా తరగతులకు సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులను నియమించి, విద్యార్థుల విద్యకు ఆటంకం కలగకుండా చూడాలని మండల విద్యా శాఖాధికారి ప్రభాకర్ రావుకు వినతిని అందజేశారు. గ్రామస్తులు బళ్లరాజు, తిరుమలశెట్టి ఈశ్వర పరశురాముడు, కొల్లాటి సత్యన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టు కక్ష సాధింపు చర్య : టిడిపి

ప్రజాశక్తి - ముసునూరు



జంగారెడ్డిగూడెంలోని దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న టిడిపి నేత

జగన్‌మోహన్‌రెడ్డి కక్ష సాధింపు పరిపాలన కొనసాగిస్తున్నాడని రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దే రఘుబాబు విమర్శించారు. సోమవారం మండలంలోని గుడిపాడులో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అరెస్టునకు నిరసనగా రిలే నిరహార దీక్షలో గద్దే రఘుబాబు, కొల్లి గంగారామ్, మండలపు ధర్మరాజు, మండలపు బుజ్జి, కొల్లి కృష్ణయ్య, బోగోలు సత్యనారాయణ, లక్కపాము కాంతారావు, భాను, రమేష్, మాజీ ఎంపిపి కొల్లి వెంకటనర్సమ్మ, మధు, పాల్గొన్నారు.

మహిళలకు ఈ రాష్ట్రంలో ఆస్తి హక్కు ఇచ్చి, గుర్తింపు తెచ్చిన నాయకుడు నారా చంద్రబాబునాయుడు అని రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు తెలిపారు. మండలంలోని రమణక్కపేటలో మహాశక్తి కార్యక్రమం ఏర్పాటు చేసి మహిళలకు అందించే సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజలకి నారా చంద్రబాబునాయుడుపై పెట్టిన అక్రమ కేసులను ప్రజలకు వివరించారు.

నూజివీడు రూరల్ : మండలంలోని బత్తులవారి గూడెంలో 18వ రోజు నిరసన దీక్ష కొనసాగింది. టిడిపి మండల అధ్యక్షుడు ముసునూరు రాజా, సర్పంచి లక్ష్మి కాంతమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎం.వెంకట సుబ్బారావు, ఎం.శాంతమ్మ, గొలుసు ఆంజనేయులు, బోసు, తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష 28వ రోజు కొనసాగింది. సోమవారం పట్టణ టిడిపి అధ్వర్యంలో అశ్వరావుపేట రోడ్డు ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నిర్వహించిన రిలే నిరాహార దీక్షలకు పొలిట్ బ్యూరో సభ్యులు పితాని సత్యనారాయణ, మాజీ ఎంపీ మాగంటి బాబు, చింతలపూడి నియోజకవర్గ పరిశీలకులు కోళ్ల నాగేశ్వరావు, టిడిపి మాజీ ఎంఎల్ఎ గంటా మురళీ, ముళ్లపూడి బాపిరాజు, జనసేన నాయకులు మేకా ఈశ్వరయ్యలు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో జగ్గవరపు ముత్తారెడ్డి, దాసరి శేషు, కోనేరు సుబ్బారావు, మండవ లక్ష్మణరావు, బొమ్మాజి అనీల్, పెనుమర్తి రామ్ కుమార్, కొండ్రెడ్డి కిషోర్, చెరుకూరి శ్రీధర్, గుమ్మడి ప్రసాద్, జనసేన నాయకులు ఆకుల రాకేష్ పాల్గొన్నారు.

నారా చంద్రబాబు నాయుడు నిర్దోషిగా విడుదల కావాలని ఆకాంక్షిస్తూ టిడిపి మహిళా కార్యకర్తలు నిరసన తెలిపారు. సోమవారం మండలంలోని గురవాయిగూడెం టిడిపి కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలో పలువురు మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళీ పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి మాజీ ఎంఎల్ఎ విరాళం

నూజివీడు రూరల్ : మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న అభయాంజనేయ స్వామి దేవాలయానికి నూజివీడు మాజీ ఎంఎల్ఎ చిన్నం రామకోటయ్య సోమవారం రూ.54,600 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి మరింతగా తోడ్పడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పూజారి పాండురంగారావు, రమేష్, గోపాలకృష్ణ, గోపాల స్వామి, విష్ణు, చిన్న ముసలయ్య, పెద్ద ముసలయ్య, రంగారావు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో రక్తదాన శిబిరం

నూజివీడు రూరల్ : పట్టణంలోని ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. డైరెక్టర్ శ్రీనివాసరావు, ప్రాంగణ ఇన్‌ఛార్జి ఎస్‌కె.రియాజ్ హుస్సేన్, నూజివీడు ఎఒ ప్రదీప్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రక్తదానం వలన ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చున్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయవచ్చున్నారు. 72 యూనిట్ల రక్తం సేకరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో 'గో - పోషణ' ప్రారంభం

ద్వారకాతిరుమల : చిన్న వెంకన్న దేవస్థానము గోశాల నందు 'గో–పోషణ పథకం' ప్రారంభించారు. ఈ పథకంలో గోవులను పోషించు భక్తులు నెలకు ఒక్కింటికి రూ.5,116 చొప్పున ఎన్ని నెలలకు గో పోషణ చేయాలనుకుంటున్నారో అన్ని నెలలకు సొమ్ము చెల్లించినచో గో పోషణ నిర్వహించబడునని, విజయదశమి నుంచి ఈ పథకము ప్రారంభమగునని ఆలయ కార్య నిర్వాహణాధికారి వేండ్ర త్రినాథరావు తెలిపారు. వివరాలకు 9989109349, 9 493249775 నెంబర్లను సంప్రదించాల్సిందిగా కోరారు.

కాన్షీరామ్‌కు నివాళి

ముదినేపల్లి : బిఎస్‌పి వ్యవస్థాపకులు కీర్తిశేషులు కాన్షిరాం 17వ వర్ధంతి సందర్భంగా సోమవారం ముదినేపల్లిలో ఆ పార్టీ శ్రేణులు ఆయనకు నివాళులర్పించారు. స్థానిక బస్‌స్టేషన్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం దగ్గర కాన్షిరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గూటం నారాయణరావు, సోమల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.